క్లుప్తంగా

డీజీ మైక్రోస్కోప్‌కు తృతీయ అవార్డు



ఉమామహేశ్వరరావును అభినందిస్తున్న ఎంఈఓ భానుప్రకాష్, గుర్ల హైస్కూల్ సిబ్బంది

గుర్ల: పాండిచ్చేరిలో ఈ నెల 21 నుంచి 25 వరకు జరిగిన జాతీయ విజ్ఞాన ప్రదర్శన పోటీల్లో గుర్ల జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు తయారు చేసిన డీజీ మైక్రోస్కోప్‌కు తృతీయ అవార్డు వచ్చింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావును ఎంఈఓలు ఎస్.భానుప్రకాష్‌రావు, ఎం.శ్రీనివాసరావు, గుర్ల పాఠశాల సిబ్బంది మంగళవారం సత్కరించారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు ప్రదర్శన



బల్లంకిలో పరుగుతీస్తున్న ఎడ్లు

వేపాడ: మండల కేంద్రంలో గ్రామదేవతలు పరదేశమ్మ, ముత్యాలమ్మ తల్లి, బల్లంకి గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు ఉత్సాహంగా సాగాయి. విజేతలకు ఆయా గ్రామాల పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎంపీడీఓ కల్యాణి

గజపతినగరం: మండల పంచాయతీ కార్యదర్శుల నూతన సంఘం ఎన్నికను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీ ఆర్డీ చల్లా సుగుణాకరరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా మంత్రి రమణ, ఉపాధ్యక్షుడిగా కర్రి పార్థునాయుడు, కార్యదర్శిగా దాసన రోజీలీన, జాయింట్ కార్యదర్శిగా బెహర రమ్య, కోశాధికారిగా గంగుల తాతారావు ఎన్నికయ్యారు. వీరికి ఎంపీడీఓ బి.కల్యాణి అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

గంట్యాడ: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడికి గాయాలయ్యాయి. మండలంలోని వసంత గ్రామానికి చెందిన సీహెచ్. అప్పలనాయుడు అదేగ్రామానికి చెందిన ఓ వ్యక్తి బైక్‌పై గంట్యాడ వైపు వస్తున్నారు. అదే సమయంలో వసంత వైపు లక్కిడాం నుంచి ట్రాక్టర్ వెళ్తుండగా లక్కిడాం రామాలయం రోడ్డులో ట్రాక్టర్, బైక్ ఢీకొట్టడంతో వృద్ధుడు కింద పడిపోగా గాయాలయ్యాయి. దీంతో స్థానికులు సర్వజన ఆస్పత్రికి తరలించారు.


ఒత్తిడికి గురికావొద్దు



బక్కునాయుడుపేటలో పదోతరగతి విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ నాగభూషణం

వేపాడ: పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనకు గురికావొద్దని, ఆత్మవిశ్వాసంతో పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం కావాలని ఎంఈఓ నాగభూషణం సూచించారు. బక్కునాయుడుపేట మోడల్ స్కూల్‌ను మంగళవారం సందర్శించారు. పదోతరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షలకు ప్రణాళికతో సిద్ధం కావా లని, సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలన్నారు. పాఠ్యాం శాల్లో ఏమైనా సందేహాలు ఉంటే ఉపా ధ్యాయులతో నివృత్తి చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు.ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. ఆయన వెంట ఎంఈఓ-2 బాల భాస్కరరావు, హెచ్‌ఎం రావాడ ఈశ్వరరావు ఉన్నారు.అలాగే దబ్బిరాజుపేట ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ నాగభూషణం, సోంపురం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-2 బాలభాస్కరరావు సందర్శించారు.

లెప్రసీ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు తీసుకోవాలి



ఏఎంజీ కాలనీ వాసులతో మాట్లాడుతున్న డాక్టర్ సాగర్

గంట్యాడ: లెప్రసీ(కుష్టు) వ్యాధిగ్రస్తులు కాళ్లకు గాయాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర కుష్టు నివారణశాఖ జేడీ డాక్టర్ సాగర్ సూచించారు. నరవ ఏఎంజీ కాలనీలో మంగళవారం ఆయన పర్యటించారు. కాలనీలో వ్యాధిగ్రస్తు లతో మాట్లాడారు.కుష్టు వ్యాధిని త్వరగా గుర్తించగలిగితే అంగవైకల్యం బారిన పడకుండా ఉండవచ్చన్నారు. వ్యాధిగ్రస్తులు చెప్పులు లేకుండా నడవకూడద న్నారు. అనంతరం గంట్యాడ పీహెచ్‌సీని సందర్శించి, లెప్రసీ సర్వేపై సిబ్బందిని ఆరా తీశారు. జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ రాణి, పీహెచ్‌సీ వైద్యులు వెంకటేష్, హేమలత, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

మామిడిని ముంచిన మంచు

- మంచు వల్ల రాలిపోతున్న పూత.. ఎదుగుదల తగ్గుతున్న పిందెలు
- దిగుబడిపై పడనున్న ప్రభావం
- ఆందోళనలో రైతులు
- జాగ్రత్తలు పాటించాలని ఉద్యానవన శాఖ అధికారుల సూచన

నియోజకవర్గంలో మండలాల వారీగా మామిడి పంట సాగు విస్తీర్ణం వివరాలు...

మండలం	విస్తీర్ణం(ఎకరాల్లో)
చీపురుపల్లి	3,014
గరివిడి	4,965
మెరకముడిదాం	10,357
గుర్ల	4,311
మొత్తం	22,647



చీపురుపల్లి మండలం పేరిపిలో రైతులకు సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న ఉద్యానవనశాఖాధికారులు



మెరకముడిదాం మండలంలోని సాతాంవలసలో సస్యరక్షణ చర్యలు చేపడుతున్న రైతులు

చీపురుపల్లి: మామిడి రైతుపై మంచు పగబట్టింది. గతకొద్ది రోజులుగా దట్టంగా కురుస్తున్న పొగమంచు పంటకు తీవ్ర నష్టం కలిగి స్తోంది. సంక్రాంతి పండగ తర్వాత నుంచి రోజూ రాత్రి నుంచి మరుసటి రోజు ఉదయం 9 గంటల వరకు మంచు కురుస్తునే ఉంది. జనవరి నెల పూర్తయినా ఇంకా చాలా వరకు మామిడి చెట్లు పూతకు రాకపోవడంపై ఓ వైపు రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్నిరకాల చెట్లు అరకొరగా పూతకు వచ్చిన ప్పటికీ మంచు వల్ల ఆపూత నిలవడం లేదు. అక్కడక్కడా కొన్నిచెట్లకు పిందెలు వచ్చినప్పటికీ వాటి ఎదుగుదలపై మంచుప్రభావం చూపిస్తుండడంతో ఈ ఏడాది నష్టాలు తప్పేలా లేవని రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. సంక్రాంతి పండగ ముందు వరకు మంచు ఎఫెక్ట్ పెద్దగా లేకపోవడంతో మామిడి పంటకు ఢోకా లేదని రైతులు భావించారు. కానీ పదిరోజులుగా కురుస్తున్న మంచు రైతుల ఆశలను ఆవిరిచేసింది. చీపురు పల్లి నియోజకవర్గంలోని నాలుగు మండ లాల్లో 22,647 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఒక్క మెరకముడిదాం మండలంలోనే 10,357 ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు. పనుకులు, సువర్ణరేఖ, బంగినపల్లి, రసాలు అత్యధికంగా సాగులో ఉన్నాయి. ప్రస్తుతం పనుకులు, సువర్ణరేఖ రకాలు పచ్చి పూత, తెల్ల పూత దశలో ఉన్నాయి. బంగినపల్లి, రసాలు మొగ్గ దశలో ఉన్నాయి. మంచు వల్లకలిగే పంట నష్టాలను తగ్గించుకునేందుకు పాటించాల్సిన సస్యరక్షణ చర్యలపై ఉద్యానవనశాఖ అధికారులు రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



మామిడి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాం. ప్రస్తుతం కురుస్తున్న మంచు మామిడి పూతపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. మంచు నుంచి ఏర్పడే నష్టాన్ని అధిగమించేందుకు ఉద్యానవన శాఖ సిబ్బంది నుంచి వచ్చే సస్యరక్షణ సూచనలు పాటించాలి.

– సీహెచ్.చంద్రశేఖర్, ఉద్యానవనశాఖాధికారి, చీపురుపల్లి

సస్యరక్షణ చర్యలు ఇలా...

- మామిడి పూత మొగ్గ దశలో ఉన్న పంటకు ఎసిఫేట్ ఒక గ్రాము లేదా క్లోరో ఫైరిఫాస్ 50 ఈసీ ఒక మిల్లీలీటర్‌తో పాటు వెట్టబుల్ సల్ఫర్ 3 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.
- పచ్చిపూత దశలో ఉన్న మామిడి తోటలకు ఇమిడాక్లోప్రిడ్ 0.5 మిల్లీలీటర్లతో పాటు హెక్సాకొనజోల్ 1.5 మిల్లీలీటర్లు లేదా సాఫ్ మందు 5 గ్రాములు లేదా థయోఫానేట్-మిథైల్ 1.5 గ్రాములతో పాటు బోరాన్ ఒక గ్రాము వాడాలి.
- నల్లపూత, పిందె దశలో ఉన్న పంటకు డైమిథోయేట్ 2.5 మిల్లీలీటర్లు లేదా థయామిథాక్సామ్ 0.5 మి.లీ, కార్బెండిజమ్, మాంకోజెబ్ 2 గ్రాములు, గమ్ 0.5 మిల్లీ లీట ర్లు కలిపి పిచికారీ చేసుకోవాలి.
- పిందెలు కోడిగుడ్డు సైజులో ఉన్నప్పుడు క్లోరిఫైరిఫాస్ 50 ఈసీ ఒక మిల్లీలీటర్ లేదా లాండా సైహెలోత్రిన్ 0.5 మిల్లీలీటర్లు, వేప నూనె 5 మిల్లీలీటర్లు, కార్బెండిజమ్ ఒక గ్రాము కలిపి పిచికారీ చేయాలి. అలాగే రాత్రి పూట దీపపు ఎరలను అమర్చాలి. అలాగే ఒక లీటరు నీటిలో 2 మిల్లీలీటర్ల మిథైల్ యూజినాల్ కార్బోఫ్యూరాన్ గుళికలు కలిపి వెడల్పాటి ప్లాస్టిక్ పల్లెంలో పోసి మధ్యలో దీపం వెలిగించి పెట్టాలి.

గీత కార్మికుల మద్యం దుకాణాలకు నోటిఫికేషన్



చీపురుపల్లిలో మాట్లాడుతున్న సీఐ చక్రవర్తి, ఎస్ఐ గిరీష్

చీపురుపల్లి/గజపతినగరం: కల్లు గీత కార్మికుల సామాజికవర్గం కోటాలో చీపురుపల్లి, గజపతినగరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు సీఐలు సీహెచ్.చక్రవర్తి, జె.జనార్ధనరావు తెలిపారు. చీపురుపల్లి, గజపతినగరంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాల్లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశాల్లో వారు మాట్లాడుతూ చీపురుపల్లి సర్కిల్ పరిధిలో గరివిడి, మెరకముడిదాం మండలాల్లో రెండు మద్యం దుకాణాలకు, గజపతినగరం సర్కిల్ పరిధిలో గజపతినగరం మండలానికి ఒక దుకాణం కేటాయిస్తూ నోటిఫికేషన్ వెలువడిందన్నారు. గరివిడి మండలంలో శ్రీశయన, మెరకముడిదాం మండలంలో యాత సామాజిక వర్గానికి, గజపతినగరంలో యాత సామాజికి వర్గానికి దుకాణాలు కేటాయించినట్లు చెప్పారు. ఫిబ్రవరి 5 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఫిబ్రవరి 7న జిల్లా కేంద్రంలో కలెక్టర్ సమక్షంలో దుకాణాల కేటాయిం పునకు డ్రా తీయనున్నట్లు స్పష్టం చేశారు. దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు ఉంటుందన్నా. అలాగే లైసె న్స్ ఫీజులు యాభై శాతంలో భాగంగా ప్రథమ సంవ త్సరానికి రూ.21.66 లక్షలు, రెండో సంవత్సరానికి రూ.35.75 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. నిబంధనల ప్రకారం జిల్లా యూనిట్‌గా కల్లు గీత కార్మికులు మద్యం దుకాణాలకు దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకునే వారు సంబంధిత కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కొత్తవలస సర్కిల్ పరిధిలో..

కొత్తవలస: కల్లు గీత కార్మికులకు కొత్తవలస సర్కిల్ పరిధిలోని కొత్తవలస రూరల్‌కు ఒక మద్యం దుకాణం కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ప్రొహిబి షన్, ఎక్సైజ్ సీఐ జి.ఎస్.రాజశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శెట్టిబలిజ, యాత సామాజిక వర్గానికి చెందిన వారు అర్హులని, ఫిబ్రవరి 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు కొత్తవలస ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

పుణ్యగిరి జాతరపై సమీక్ష



మాట్లాడుతున్న సర్పంచ్ సంతోషికుమారి

శృంగవరపుకోట: శివరాత్రి సందర్భంగా ఎస్.కోటలోని పుణ్యగిరిలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతరకు పంచాయతీ చేయాల్సిన ఏర్పా ట్లు, కల్పించాల్సిన వసతులపై పాలకవర్గంతో సర్పంచ్ సంతోషికుమారి అధ్యక్షతన, ఈఓ అనూరాధ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఏటా జాతర కోసం పంచాయతీ కొంత మొత్తం కేటాయించి పారిశుద్ధ్య పనులు, ధూళి లేవకుండా రోడ్లు తడపడం, తాత్కాలిక మరుగుదొడ్లు, చలివేంద్రాల నిర్వహణ, వన్‌వే జంక్షన్, ఎరుకమ్మ పేరంటాలు గుడి, దేవీ జంక్షన్ నుంచి డిగ్రీ కళాశాల వరకూ విద్యుత్ దీపాల అలంకరణ, తదితర ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. దీనిపై వార్డు సభ్యుల అభిప్రాయాలను కోరగా, పలువురు సభ్యులు భక్తులకు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, అందుకు అవసరమైన నిధులు పంచాయతీ నుంచి ఖర్చు చేసేందుకు అనుమతించారు. ఇటీవల ప్లాన్ అప్రూవల్స్ కోసం వచ్చిన కొన్ని ప్లాన్స్‌ను సభ్యులు ఆమోదించారు. పంచాయతీలో పాడైన విద్యుత్ స్తంబాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుకు సభ్యులు కోరగా, వాటికి సంబంధించిన ప్రతిపాదనలు ఇవ్వాలని సర్పంచ్ సూచించారు. ఎస్సీ కాలనీలో 104వాహనం కోసం షెడ్ నిర్మాణం చేయాలని నిర్ణయించారు. ప్రజలకు అవసరమైన పనులను ప్రతిపాదించి వార్డు సభ్యులు వాటిని దగ్గర ఉండి పూర్తి చేయించాలని సర్పంచ్ కోరారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

- డీఎంహెచ్‌ఓ జీవనరాణి



మందుల నిల్వలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

బొండపల్లి: పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని డీఎం హెచ్‌ఓ జీవనరాణి సూచించారు.దేవుపల్లి పీహెచ్‌సీలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. మందులను భద్రపరిచే డీప్ ఫ్రీజర్‌తో పాటు, మందుల నిల్వలు, యూడీసీ, ఐఎల్‌ఆర్ రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా వైద్య సిబ్బంది తో మాట్లాడుతూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో ప్రజలు రోగాల బారినపడినప్పుడు వైద్య శిబిరాలు ఏర్పా టు చేసి సేవలందించాలన్నారు. అలాగే మందుల కొరత లేకుండా చూసుకోవాలని, ఇంకా ఏమైనా మందులు కావాల్సి ఉంటే తక్షణమే జిల్లా కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాలన్నారు. ప్రధానంగా కుక్కకాటు, పాముకాటుకు ఇంజెక్షన్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలన్నారు. ఆమె వెంట ఎంపీహెచ్‌ఈఓ బి.నారాయణప్పలనాయుడు ఉన్నారు.

లాలా లజపతిరాయ్ జయంతి వేడుకలు



లాలా లజపతిరాయ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లెక్చరర్లు, విద్యార్థులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్యోద్యమకారుడు, పంజాబ్ కేసరి లాలా లజపతిరాయ్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. లాలా లజపతిరాయ్ చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు మాట్లాడుతూ కొందరి త్యాగాలు చరిత్రలో నిలుస్తాయని, నాటి స్వాతంత్ర్య సంగ్రామంలో లాలా లజపతిరాయ్ చేసిన పోరాటాలు ఒక మైలురాయి అన్నారు. ఒక్కో రక్తపు బొట్టు నుంచి లక్షలాది మంది స్వాతంత్ర్యయోధులు ఉద్భవిస్తారని చాటిన యోధుడు లజపతిరాయ్ అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కె.వాసుదేవరావు, హిస్టరీ లెక్చరర్ సీహెచ్.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పీఓ భాస్కర్, అధ్యాపకుడు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతికి లేఖలు రాసిన అంగన్‌వాడీలు



మెరకముడిదాం: మెరకముడిదాంలో రాష్ట్రపతికి రాసిన లేఖలను చూపిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



బొండపల్లి: గొట్లాంలో రాష్ట్రపతికి పంపిస్తున్న లేఖలను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



గజపతినగరం: రాష్ట్రపతికి రాసిన లేఖలను చూపిస్తున్న గజపతినగరం సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు

అంగన్‌వాడీ కార్యకర్తలను గ్రేడ్-3, ఆయాలను గ్రేడ్-4 ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరణ చేయాలని ఇటీవల గుజరాత్ హైకోర్టుతో పాటు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం అమలు చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖలు రాశారు. మెరకముడిదాం మండలంలోని గర్భాం, మెరకముడిదాం, గజపతినగరం మండలంలోని మరుపల్లి, బొండపల్లి మండలంలోని బొండపల్లి,గొట్లాం,దేవుపల్లి సెక్టార్లలో అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. సమస్యలపై చర్చించిన అనం తరం అంగన్‌వాడీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్రపతికి లేఖలు రాశారు. 7వ పే కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా కనీసవేతనం రూ. 26 వేలు అందించాలని, వడ్డీతో సహా గ్రాట్యుటీ చెల్లించేలా చూడాలని లేఖల్లో కోరారు.

– మెరకముడిదాం/బొండపల్లి/గజపతినగరం

నిబంధనలు పాటించకుంటే చర్యలు

- గ్రామసభ తీర్మానాలు లేకుండా గోకులాలు ఎలా మంజూరు చేశారు..?
- మండల సర్వసభ్య సమావేశంలో ఉపాధి అధికారులపై జెడ్పీ ఛైర్మన్ ఆగ్రహం



ఉపాధి హామీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గుర్ల: అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి జెడ్పీ ఛైర్మన్ అతిథిగా హాజరయ్యారు. శాఖల వారీగా అధికారులు ప్రగతినివేదికలు చదివి వినిపించారు. గొలగాం సర్పంచ్ కలిశెట్టి అప్పలరాజు మాట్లాడుతూ గ్రామసభ తీర్మానం లేకుండానే ఉపాధి హామీ పథకం ద్వారా మినీగోకులం షెడ్లను అనర్హులకు, పశువులు లేని వారికి అధికారులు మంజూరు చేశారని సభ దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీ ఛైర్మన్ స్పందిస్తూ గ్రామసభలో తీర్మానం లేకుండా మినీగోకులం షెడ్లు ఎలామంజూరు చేస్తారని, అర్హులను పక్కన పెట్టి, అర్హత లేని వారికి ఎందుకు మంజూరు చేశారని ఉపాధి హామీ ఏపీఓ కామేశ్వరరావును ప్రశ్నించారు. చింతపల్లిపేటలో ఉపాధి పనులకు సంబంధించిన గ్రామసభను టీడీపీ నాయకులతో జరిపించారని, తమకు కనీససమాచారం కూడా ఇవ్వలేదని సర్పంచ్ జమ్ము శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే చోడవరం, గోషాడలో వేతనదారులకు ఉపాధి పనులు కల్పించకుండా ఉపాధి సిబ్బంది కుంటిసాకులు చెబుతున్నారని సభ్యులు జెడ్పీ ఛైర్మన్‌కి వివరించారు. చోడవరం, గోషాడలో వారంలోగా ఉపాధి పనులు ప్రారంభించాలని జెడ్పీ ఛైర్మన్ అధికారులను ఆదేశించారు. సర్పంచ్ లేకుండా గ్రామసభ నిర్వహించినట్లు రుజువైతే మరో నెలలో అత్యవసర సమావేశం నిర్వహించి ఉపాధి హామీ ఏపీఓ కామేశ్వరరావుపై ఉన్నత అధికారులకు నివేదిక పంపించి సస్పెన్షన్‌కు సిఫార్స్ చేస్తామన్ని హెచ్చరించారు. గతేడాది డిసెంబర్‌లో కురిసిన వర్షాలకు వందల ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లిందని, రైతు లకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూడాలని పలుగ్రామాల ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు. ఏఓ తిరుపతిరావు స్పందిస్తూ ఈ-క్రాప్‌లో నమోదు చేసుకుని, బీమా ప్రీమియం చెల్లించిన వారికి నష్ట పరిహారం అందించేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని చెప్పారు. గూడెం, పెనుబర్తిలో ఎక్కువగా పైలేరియా వ్యాప్తి చెందుతోందని, ఈరెండు గ్రామాల్లో ప్రతి ఒక్కరూ డీఈసీ , అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని జిల్లా మలేరియా అధికారి వై.మణి సూచించారు. జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, పొట్నూరు సన్యాసినాయుడు , వైస్ ఎంపీపీలు తోట తిరుపతిరావు, అంబల్ల చిన్నారావు, ఎంపీడీఓ శేషుబాబు, తహసీల్దార్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో జాప్యం సమంజసం కాదు



ఆతవ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం విషయంలో అధికారులు, పాలకులు జాప్యం చేయడం సమంజసం కాదని సీపీఎం నాయకుడు చల్లా జగన్, బహుజన దళిత సంఘం నాయకుడు ఆతవ ఉదయ్ భాస్కర్ అన్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆతవ జంక్షన్ వద్ద ఆ గ్రామస్తులు రెండో రోజు మంగ ళవారం నిరసనలు కొనసాగించారు. ఈసందర్భంగా జగన్ మాట్లాడుతూ వేపాడ-సోంపురం ప్రధాన రహదారి నుంచి ఆతవ గ్రామానికి బీటీ రోడ్డు వేసేందుకు గత ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయని, పనులు ప్రారంభమై మధ్యలో నిలిచిపోయాయని గుర్తు చేశారు. నిధులున్నప్పటికీ పనులు చేయకుండా కాలయాపన చేస్తున్నారని, తక్షణమే తారురోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పనులు ప్రారంభించేవరకు ఆందోళన కొనసాగుతుందన్నారు. గ్రామస్తుల నిరసన చేస్తున్న శిబిరం వద్దకు వైఎస్సార్‌సీపీ వేపాడ మండల కన్వీనర్ ముమ్మలూరు జగ్గబాబు, నాయకుడు ద్వారపూడి గంగునాయుడు, సర్పంచ్ వేమన నాయుడు, పలు సంఘాల నాయకులు కర్రి దేముడు, దేబార్కి కిరణ్, నాగరాజు, డప్పురాజు, గురుమూర్తి తమ సంఘీభావం తెలిపారు – వేపాడ

రుద్రాభిషేకం



పుష్యమాస శివరాత్రి సందర్భంగా తుమ్మికాపల్లి సమీపంలోని ఓం సదనం ఆశ్రమంలో 108 శివ లింగాలకు అర్చకులు అంపోలు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో మంగళ వారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. – కొత్తవలస

దళితుల ధర్నా



దళితవాడల్లో మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వం బాధ్యత కాదా..? అధికారులకు జవాబుదారీతనం లేదా..అంటూ సీపీఎం నేతలు ప్రశ్నించారు. జామి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పాతభీమసింగి గ్రామానికి చెందిన ఎస్సీ, రెల్లి కులస్తులు సీపీఎం నేతలు మద్దిల రమణ, గాడి అప్పారావు నేతృత్వంలో మంగళ వా రం ధర్నా చేశారు. ఈసందర్భంగా రమణ మాట్లాడుతూ పాతభీమసింగి గ్రామంలో 20 దళిత కుటుంబాలకు గతంలో ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇచ్చారు కానీ ఇళ్లు మంజూరు చేయలేదన్నారు. దళితవాడలో తాగునీటి బోర్లు, సీసీరోడ్లు, కాలువలు లేవని, అర్హత ఉన్నప్పటికీ డప్పు కళాకారులకు పింఛన్లు మంజూరు కాలేదని, ఇది అధికారులు, పాలకుల వైఫల్యం కాదా అని నిలదీశారు. సమస్యలపై అధికారులు దృష్టి సారించకపోతే దశలవారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మీసాల అప్పలరాజు, నేలపు సంతోష్, ఎం.కొండమ్మ, ఎన్.గంగాభవాని, ఎం.అప్పన్న, ఎం.ఎలమ్మ, ఎం.సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. – శృంగవరపుకోట

సంక్షిప్తంగా...

247మద్యం సీసాలు స్వాధీనం

గజపతినగరం: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు మంగళవారం ద్విచక్రవాహనంపై 247 మద్యం సీసాలు తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించనట్లు చెప్పారు.

నేత్ర వైద్య శిబిరం

మెరకముడిదాం: స్థానిక పీహెచ్‌సీలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్‌ఫౌండేషన్, సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళ వారం నేత్రవైద్య శిబిరం నిర్వహించారు.శిబిరంలో 69 మందికి శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆప్తాలమిక్ వివేక్‌వర్మ నేత్రపరీక్షలు చేసి 31మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వైద్యాధికారి అజిత్ బాబు, హెల్త్‌ఆఫీసర్ రామారావు, క్యాంప్ జూనియర్ మేనేజర్ వెంకటరమణ పాల్గొన్నారు.

30, 31వ తేదీల్లో పరదేశిమాంబ తీర్థం



వాల్‌పోసర్లు ఆవిష్కరిస్తున్న గ్రామపెద్దలు

వేపాడ: వావిలపాడు గ్రామదేవత పరదేశిమాంబ తీర్థం ఈనెల30,31 తేదీల్లో నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. తీర్థమహోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం ఆవిష్కరించారు. 31న ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

బొండపల్లి: వేండ్రాం గ్రామ బీసీ కాలనీలో ప్రభు త్వ తాగునీటి హ్యాండ్ బోరు ప్లాట్ ఫామ్‌ను ఆక్రమించి ఓ వ్యక్తి ఇంటి ప్రహరీ నిర్మిస్తుండడంపై 'బోరు ఆక్రమణ' శీర్షికతో సాక్షిలో మంగళవారం కథనం ప్రచురితమైంది. ఈవార్తకు అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ సునీల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి లోకేష్‌తో పాటు, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుడు బోరును పరిశీలించారు. ఆక్రమణలను గుర్తించి, వాటిని తొలగించాలని సదరు ఇంటి నిర్మాణదారుడికి సూచించారు.

సచివాలయంలో ఆధార్ సెంటర్ ప్రారంభం

వేపాడ: శింగరాయి గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను సర్పంచ్ నిరుజోగి వెంకటరావు మంగళవారం ప్రారంభించారు. ఈ కేంద్రంలో చిన్నారులకు కొత్తగా ఆధార్ కార్డు మంజూరు చేయడంతో పాటు పిల్లల ఆధార్ కార్డుల్లో పుట్టినతేదీల సవరణ, తదితర సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామపెద్దలు అమ్మతల్లినాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొట్లాట కేసులో ఇరువర్గాలపై కేసు నమోదు

బొండపల్లి: తమపై దాడిచేశారంటూ ఒక వర్గం వారు, కాదు తమపై దాడి చేశారంటూ మరో వర్గం ఇచ్చిన పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ యు.మహేష్ మంగళవారం తెలిపారు. గొల్లలపేట గ్రామానికి చెందిన పీతల చంటిబాబుపై బొండపల్లి గ్రామానికి చెందిన బొండపలి ఆదినారాయణ దాడి చేసినట్లు పీతల సత్యం ఫిర్యాదు చేశాడు. అలాగే తన కుమారుడిపై పీతల చంటిబాబు దాడి చేశారని బొండపల్లి అప్పలసూర్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

సూర్యఘర్ పథకంపై అవగాహన

గంట్యాడ: ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంపై పెదవేమలి గ్రామంలో ఏపీఈపీడీఎల్ ఈఈ పి.త్రినాథరావు మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రాయితీపై సోలార్ రూఫ్ టాప్ పరికరాలు అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. డీఈ భీమరాజు, ఏఈ శ్రీనివాస్, ఎంపీటీసీ పొటుపురెడ్డి భవాని, సర్పంచ్ వర్రి పాపునాయుడు, లైన్‌మన్ సింహాచలం పాల్గొన్నారు.